- తల్లీబిడ్డ ఆరోగ్యానికి భరోసా కల్పించేలా సర్కారు న్యూట్రిషన్ కిట్లు
- గర్భిణుల ఆరోగ్యంతోపాటు కడుపులోని బిడ్డ ఎదుగుదలకు దోహదం
- అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు రక్తహీనత పరీక్షలు
- లోపం ఉన్న వారికి బలవర్ధకమైన ఆహారం అందజేత
- జిల్లాలో 16,300 మంది గర్భిణులకు కిట్ల పంపిణీ
- సీఎం కేసీఆర్‌ను మరవమంటున్న లబ్ధిదారులు



గర్భిణులు అందుకున్న కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు( ఫైల్)

# హిట్టు.. న్యూట్రిషన్ కిట్టు

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ) : బిడ్డ కడుపులో పడినప్పటి నుంచి గర్భిణికి మంచి పోషకాలు అందితేనే తల్లి కడుపులో ఆరోగ్యంగా ఎదుగుతుంది. ఎలాంటి పోషకాలు, పౌష్టికాహారం తీసుకోలేని పేద గర్భిణులు ప్రసవ సమయంలో ఇబ్బంది పడడం.. పుట్టే బిడ్డ ఆరోగ్యవంతంగా లేకపోవడం తోపాటు తదితర సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నది. ఈ క్రమంలో సీఎం కేసీఆర్ ఆరోగ్యకరమైన సమాజం కోసం.. గర్భిణుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా న్యూట్రిషన్ కిట్‌ను ప్రవేశపెట్టారు. రక్తహీనత ఉన్న జిల్లాలను గుర్తించి ఆయా జిల్లాల పరిధిలో గర్భిణులకు న్యూట్రిషన్ కిట్ అందించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా బలవర్ధకమైన ఆహారం అందించేందుకు చర్యలు చేపట్టారు. జిల్లాలో మొట్టమొదటిసారిగా ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఇప్పటికే ప్రసవించిన తల్లులకు కేసీఆర్ కిట్టు అందించడంతోపాటు గర్భిణిగా ఉన్నప్పుడు సరైన పోషకాహారం తీసుకోవాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన న్యూట్రిషన్ కిట్టు పథకం జిల్లాలో సక్సెస్ అయ్యింది.



## కాబోయే అమ్మకు సర్కారు భరోసా...

గర్భిణుల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపం నివారించడానికి ప్రభుత్వం సరికొత్త ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా తొలిసారిగా తొమ్మిది జిల్లాల్లో న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేసి తర్వాత అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఒక్కో కిట్‌లో కిలో ప్రొటీన్ పౌడర్ ప్యాకెట్, 3 ఐరన్ సిరప్‌లు, ఖర్జూర, నెయ్యి ప్యాకెట్, ఆల్బెండజోల్ ట్యాబ్లెట్, ఒక కప్పు సైతం ఉంటాయి. ఆయా కేంద్రాల్లో నమోదైన గర్భిణులకు ముందుగా పీహెచ్‌సీల పరిధిలో పంపిణీ చేయగా.. రెండో విడత ప్రసవమైన కేంద్రాల వద్ద న్యూట్రిషన్ కిట్లు ఇస్తున్నారు.

## జిల్లాలో 16,300 మందికి పైగా లబ్ధి

పౌష్టికాహారంతోపాటు రక్తహీనత సమస్యలకు చెక్ పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేస్తుండగా.. జిల్లాలో 16,300 మంది గర్భిణులకు ఇప్పటివరకు కిట్లు అందజేశారు . జిల్లాలోని 29 పీహెచ్‌సీలు, 5 యూపీహెచ్‌సీలు, 4 సీఎఫ్‌డబ్ల్యూసీ కేంద్రాలు ఉండగా.. 13 నుంచి 27 వారాల గర్భిణులకు మొదటి కిట్, 28 నుంచి 34 వారాల గర్భిణులకు రెండో న్యూట్రిషన్ కిట్‌ను అందిస్తారు. మొదటి కిట్ అందించిన నెల రోజులకు రెండో కిట్ పంపిణీ చేస్తారు. ప్రతి ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలో 13 నుంచి 27 వారాల గర్భిణులు, 28 నుంచి 34 వారాల గర్భిణులు ఎంత మంది ఉన్నారన్నది పక్కాగా లెక్కలు తీసుకుని వీటిని పంపిణీ చేస్తున్నారు.

## అంగన్‌వాడీల్లో రక్తహీనత పరీక్షలు

కాబోయే తల్లి ఆరోగ్యంగా ఉండేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో జబ్బ కొలతల ద్వారా రక్తహీనత పరీక్షలు చేస్తున్నారు. నెలనెలా అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులుగా నమోదైన వారికి ఆరోగ్య పరీక్షలు చేయడంతోపాటు జబ్బ కొలతలు తీసి రక్తహీనత లోపాన్ని గుర్తిస్తున్నారు. లోపం ఉన్న వారికి ప్రత్యేకంగా డబుల్ రేషన్ ఇచ్చి వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడంలో అంగన్‌వాడీలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. దీంతోపాటు సీడీపీవోలు, డీడబ్ల్యూవోలకు జూమ్ మీటింగ్‌ల ద్వారా సమావేశాలు నిర్వహించడంతోపాటు గర్భిణుల ఆరోగ్యవంతమైన జీవితానికి తమవంతు కృషి చేస్తున్నారు.

### సీఎం కేసీఆర్‌ది మంచి ఆలోచన



బిడ్డ పుట్టిన తర్వాత ఇబ్బంది పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే సరైన సమయంలో మంచి పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలి. అందరికీ అలాంటి ఆహారం దొరికినా నిర్లక్ష్యం చేస్తారు. దీంతో తెలంగాణ ప్రభుత్వమే ఒకడుగు ముందుకేసి పీహెచ్‌సీలలోనే మంచి ఆహారం అందజేస్తున్నది. దీనివల్ల తల్లితోపాటు బిడ్డ ఆరోగ్యంగా ఉంటారు. సీఎం కేసీఆర్ ఏ పథకం ప్రవేశపెట్టినా అది ప్రజల బాగు కోసమే.

**– ఉషశ్రీ, కూలీలైన్, కొత్తగూడెం**

### తల్లీబిడ్డ ఆరోగ్యం బాగుంటుంది



తల్లీబిడ్డ కోసం ఆలోచించే ప్రభుత్వం ఉందంటే అంతకంటే ఇంకేం కావాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో పాలు, గుడ్లు ఇస్తున్నారు. ఆరు నెలల తర్వాత పోషకాల కిట్టు ఇస్తున్నారు. కిట్లు రెండు సార్లు ఇస్తున్నారు. ఆస్పత్రిలో ప్రసవం తర్వాత కేసీఆర్ కిట్టు ఇస్తున్నారు. మాకు అంతకంటే ఏం కావాలి. మంచి పథకాలు ప్రవేశపెట్టిన కేసీఆర్ సారు మళ్లీ ముఖ్యమంత్రిగా రావాల్సిందే. ఇటువంటి సీఎంను ఎప్పటికీ మరువం.

**– పద్దం లక్ష్మి, సీతాయిగూడెం, చంద్రుగొండ మండలం**

### ఆరోగ్యమే మహాభాగ్యం



ఆరోగ్యం విషయంలో ప్రభుత్వం చాలా మంచి నిర్ణయాలు తీసుకుంటున్నది. గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు అందించేందుకు నిర్ణయించడంతో జిల్లా పరిధిలోని పంపిణీకి ఏర్పాట్లు చేశాం. జిల్లాలో 13 వారాల నుంచి 27 వారాలు, 28 నుంచి 34 వారాల గర్భిణుల వివరాలు సేకరించాం. వారందరికీ కిట్లు అందజేశాం. మంచి పోషకాలు కలిగిన ఆహారం కిట్టులో ఉంది. ఇప్పటివరకు జిల్లాలో 16,300 మందికి కిట్లు అందజేశాం.

**– డాక్టర్ శిరీష, డీఎంహెచ్‌వో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా**

---

### భక్తరామదాసు ఎత్తిపోతల

# ఆలోచన ముమ్మాటికీ కేసీఆర్‌దే !

- నిజమైన అపర భగీరథుడు కేసీఆర్..
- తుమ్మల గొప్పలు కేవలం ప్రగల్భాలు మాత్రమే..
- కాంగ్రెస్ పార్టీకి పవర్ ఇస్తే పవర్ కట్ తప్ప ఇంకేమీ ఉండదు
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- ఖమ్మం నగరంలో ఆర్యవైశ్యులతో ఆత్మీయ సమ్మేళనం





మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్,హాజరైన ఆర్యవైశ్యులు

ఖమ్మం, అక్టోబర్ 29: పాలేరు నియోజకవర్గంలో భక్తరామదాసు ఎత్తిపోతల పథకం నిర్మించాలనే ఆలోచన ముమ్మాటికీ సీఎం కేసీఆర్‌దేనని, కానీ తన ఆలోచనగా మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బయట ప్రచారం చేసుకుంటున్నారని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మం నగరంలోని వాసవి గార్డెన్స్‌లో ఆదివారం ఆర్యవైశ్య ప్రముఖులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. తుమ్మల తనను తాను అపర భగీరథుడితో పోల్చుకుంటున్నారని, నిజానికి ప్రాజెక్టులు నిర్మించి, చెరువులను బాగు చేసిన సీఎం కేసీఆర్ నిజమైన భగీరథుడని కొనియాడారు. సీఎం కేసీఆర్‌కు గతంలో మంత్రి పదవి ఇప్పించానని తుమ్మల ప్రగల్భాలు పలుకుతున్నారని, అందులో ఏమాత్రం వాస్తవం లేదని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ ఏ ఎన్నికలోనూ ఓటమి పాలవలేదన్నారు. కానీ తుమ్మల మాత్రం పోటీ చేసిన ప్రతిసారి ఓడిపోతున్నారన్నారు. తాను గెలిచినా, ఓడినా ఖమ్మంలోనే ఉంటానని, కానీ తుమ్మలకు అది సాధ్యం కాదన్నారు. వ్యాపారులను బ్లాక్‌మెయిల్ చేసిన సంస్కృతి తుమ్మలది అని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి అసమ్మతి సెగ తగులుతూనే ఉంటుందన్నారు. ఇప్పటి వరకు ఆ పార్టీ సీఎం అభ్యర్థి ఎవరో కూడా ప్రకటించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి పవర్ ఇస్తే పవర్ కట్ తప్ప ఇంకేమీ ఉండదన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆర్య వైశ్యుల పాత్ర ఎనలేనిదని కొనియాడారు. కొంతమంది కుహనా మేధావులు వారికే అంతా తెలిసినట్లు కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేశారన్నారు. ప్రొఫెసర్ కంచె ఐలయ్య ఆర్య వైశ్యులను కించపరిచేలా పుస్తకం రాసి విడుదల చేసినప్పుడు తాను ఆర్యవైశ్యులతో కలిసి ఆందోళన చేశానని గుర్తుచేశారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికల సమయంలో ఆర్య వైశ్య సామాజిక వర్గానికి చెందిన వ్యక్తే అధ్యక్షుడిగా ఉండాలని చిన్ని కృష్ణారావును ఏకగ్రీవంగా ఎన్నుకునేలా కృషి చేశానన్నారు. గాంధీచౌక్‌ను సుందరీకరించానన్నారు. త్రీ టౌన్ ప్రాంతంలో గోళ్లపాడు చానెల్‌ను ఆధునీకరించానన్నారు. ఇప్పుడు ఒక పార్టీలో చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతున్న మాజీ ఎంపీ పొంగులేటి, మాజీ మంత్రి తుమ్మల తనను గత ఎన్నికల్లో ఓడించేందుకు తీవ్రంగా యత్నించారని ఆరోపించారు. 2014లో తనపై పోటీ చేసి ఓడిపోయిన తుమ్మలను సీఎం కేసీఆర్ పిలిచి మంత్రి పదవి ఇచ్చారన్నారు. అనంతరం సుమారు 2 వేల మంది ఆర్యవైశ్యులు మంత్రి అజయ్‌కుమార్‌కు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు.

## పువ్వాడతోనే మా ప్రయాణం..

ఆర్యవైశ్య ప్రముఖులు గుర్రం ఉమా మహేశ్వరరావు, చెరుకూరి కృష్ణమూర్తి, చిన్ని కృష్ణారావు మాట్లాడుతూ.. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెంటే తమ ప్రయాణమని స్పష్టం చేశారు. పువ్వాడను ఎన్నికల్లో గెలిపించేందుకు తమ వంతు బాధ్యత నిర్వర్తిస్తామన్నారు. మంత్రి ఇప్పటివరకు వ్యాపార వర్గాలకు అనుకూలంగా ఉన్నారని, తమకు ఎలాంటి ఇబ్బందులు రానీయకుండా చూసుకున్నారన్నారు. అలాంటి నేతను గెలిపించుకుంటే వ్యాపార వర్గాలకు అన్ని విధాలా ప్రయోజనమన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ సీనియర్ నేత ఆర్జేసీ కృష్ణ, కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్, జీవీ మాల్ అధినేత గుర్రం ఉమామహేశ్వరరావు, భద్రాద్రి బ్యాంక్ చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి, వర్తక సంఘం అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు, విద్యావేత్త పులిపాటి ప్రసాద్, ఇతర ప్రముఖులు వేములపల్లి వెంకన్న బాబు, గుర్రం తిరుమలరావు, కొత్త వెంకటేశ్వర్లు దేవత అనిల్, కురువెళ్ల ప్రవీణ్, గోళ్ల రాధాకృష్ణ, నరేశ్, టీవీ బాబు పాల్గొన్నారు.

---

# పాలేరుకు మళ్లీ గోదావరి జలాలు

### జలాశయంలో పెరుగుతున్న నీటిమట్టం..

### నర్సింహాపురం వద్ద ప్రవాహాన్ని పరిశీలించిన సీఈ



గోదావరి జలాలను పరిశీలిస్తున్న చీఫ్ ఇంజినీర్ విద్యాసాగర్, ఈఈ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ అధికారులు

కూసుమంచి, అక్టోబర్ 29: పాలేరు ఆయకట్టు కింద వేసిన పంటలను కాపాడేందుకు సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ నెల 6న తీసుకున్న నిర్ణయంతో రిజర్వాయర్‌కు బయ్యన్న వాగు ద్వారా కృష్ణా జలాలు మళ్లించాలని నిర్ణయించారు. అందులో భాగంగా ఈ నెల 13 నుంచి నాలుగు రోజులపాటు గోదావరి జలాలు పాలేరుకు మళ్లించి సాగర్ ఆయకట్టుకు విడుదల చేశారు. మళ్లీ వర్షాభావ పరిస్థితులు కన్పిస్తుండడం, ఎండలు వేసవిని తలపిస్తుండడంతో వరి పొలాలకు నీరు కావాలని రైతులు కోరుతున్నారు. దీంతో పాలేరు కింద వానకాలం వేసిన పంటలు కాపాడేందుకు శనివారం బయ్యారం రిజర్వాయర్ నింపి దాని నుంచి సుమారు 72 కిలోమీటర్ల గ్రావిటీ ద్వారా బయ్యన్నవాగు నుంచి గోదావరి జలాలను పాలేరు వాగుకు వదులుతున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా మోతె మండలం నర్సింహాపురం వద్ద పాలేరు వాగులో గోదావరి జలాలు కలుస్తుండడంతో ఆ నీటి ప్రవాహాన్ని చీఫ్ ఇంజినీర్ విద్యాసాగర్, ఈఈ మంగలపుడి వెంకటేశ్వర్లు, ఇతర ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. బయ్యన్నవాగు ద్వారా 1,600 క్యూసెక్కుల నీరు దిగువకు వస్తుండగా అందులో నుంచి 1,200 క్యూసెక్కుల నీరు పాలేరు రిజర్వాయర్‌లోకి చేరుతోంది. శనివారం సాయంత్రానికి పాలేరు నీటిమట్టం 18 అడుగులు ఉండగా.. సోమవారం నాటికి 22 అడుగులకు చేరుకునే అవకాశం ఉంది. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ.. బయ్యన్నవాగు ద్వారా గోదావరి జలాలు వస్తున్నందున ఆ ప్రాంతంలోని పశువుల, మేకల కాపరులు, రైతులు జాగ్రత్తగా ఉండాలని, ప్రవాహం ఎక్కువగా ఉన్నందున వాగు దాటవద్దని సూచించారు. కాగా, సాగర్ కింద మొదటి జోన్‌లో కల్లూరు వరకు గల ఆయకట్టు కింద పంటలు కాపాడేందుకు అధికారులు పాలేరు రిజర్వాయర్ నుంచి ఒకటి రెండు రోజుల్లో నీటిని విడుదల చేయనున్నారు.